క్లుప్తంగా

ఇది ఎవరికోసం?



నిరుపయోగంగా ఉన్న దుకాణం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారులు ఏ కార్యక్రమం ఎందుకు చేస్తారో.. ఎవరికీ తెలియదు. గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.8 లక్షల వ్యయంతో ఫైబర్‌తో చేసిన దుకాణాన్ని కొనుగోలు చేశారు. ఈఓ కార్యాలయానికి వెళ్లే గేటు సమీపంలో దీన్ని ప్రారంభించి.. ఆ తర్వాత వారం రోజులకే మూతేశారు. అప్పటి నుంచి ఇది మూతకమే పరిమితమవడం విమర్శలకు తావిస్తోంది.

తిరుచ్చిపై ఆండాళ్ అమ్మవారు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆండాళ్ తిరువాడిపుర ఉత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన ఆండాల్ అమ్మవారు మాడవీధుల్లో విహరించారు. పది రోజుల పాటు నిర్వహించే ఆండాల్ తిరువాడిపుర ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తమిళ ఆడి నెలలో పది రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు. ఉత్సవాలలో చివరి రోజైన ఆగస్ట్ 7న బుధవారం ఆండాళ్ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలు పూర్తి చేశారు. తిరువాడిపుర ఉత్సవాల ప్రారంభ సందర్భంగా ఆండాళ్(గోదాదేవి)కి అభిషేకం, అర్చనలు చేశారు. సాయంత్రం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన అమ్మవారు మాడవీధుల్లో విహరిస్తూ భక్తుల నుంచి కర్పూర హారతులు అందుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆండాళ్ అమ్మవారికి ఆస్థానం నిర్వహించి, ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. స్థానిక ఆలయాల సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు తదితరులు పర్యవేక్షించారు.

అంధకారంలో ఆడికృత్తిక ఉత్సవాలు

నాగలాపురం: పిచ్చాటూరు మండలంలోని రామగిరి శ్రీవల్లీ దేవసేన ముత్తుకుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలు అంధకారంలో సాగాయి. ఆడికృత్తిక వేడుకల్లో ఒక్క వీధి లైటు వెలగకపోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. దీనిపై భక్తులు ఆలయ అధికారులు, పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

వర్షాకాలం.. కరెంట్‌తో జాగ్రత్త

- విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు అత్యధికం
- తడి చేత్తో స్విచ్‌లు, స్విచ్ బోర్డులు ముట్టుకోవద్దు
- ఏదైనా సమస్య ఉంటే 1912 ట్రోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలి



వరదయ్యపాలెంలో చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

విద్యుత్ వెలుగులు నింపుతుంది. మన దైనందిత జీవితంలో ఇది చాలా ముఖ్యం. మరి ఈ కరెంట్‌తో ఏ మాత్రం అజాగ్రత్త వహించినా నిండు జీవితాన్ని బలి తీసుకుంటుంది. వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదాలు మన బతుకులో తీరని విషాదాన్ని నింపుతాయి.

వరదయ్యపాళెం: వర్షాకాలం ప్రారంభం కావడంతో విద్యుత్ ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. కాస్త అప్రమత్తంగా వ్యవహరిస్తే ఈ ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని విద్యుత్‌శాఖ అధికారులు సూచిస్తున్నారు. వర్షాకాలంలో వానలు, గాలులకు చెట్ల కొమ్మలతో పాటు విద్యుత్ స్తంభాలు విరిగి పడుతుంటాయి. విద్యుత్ తీగలు కిందకు వాలి ప్రమాదకరంగా కనిపిస్తుంటాయి. వానలు పడే సమయంలో వీటిని గమనించకపోతే ప్రమాదాలకు గురికావడం తప్పదు. పంట పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాల్సి అవసరం ఎంతైనా ఉంది. విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నాయో? లేదో గమనించుకోవాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చాలా వరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్ల మధ్యనే ఉంటాయి. వాటిలో చాలా వాటికి రక్షణ కంచెలు కూడా ఉండవు. విద్యుత్ తీగలు చెట్ల కొమ్మల మధ్య ఉండడం, పొలాల్లో వేసిన విద్యుత్ తీగలు చేతికి అందేలా ఉండడం, ఇళ్లకు సమీపంలో నుంచే తీగలు వెళ్లడం, స్తంభాలు విరిగి పోవడం, ఒరిగిపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. ఈ ముప్పు వర్షాకాలంలో ఎక్కువగా ఉంటాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే ట్రోల్ ఫ్రీ నెంబర్ 1912కు సమాచారం ఇవ్వాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.

చేయకూడని పనులివే..

- సబ్‌స్టేషన్ ఉన్న ప్రాంతంలో రక్షణ కోసం ఏర్పాటు చేసిన కంచెకు దూరంగా ఉండాలి.
- వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలను ముట్టుకోవడం చేయకూడదు.
- స్తంభాలను తాకుతూ వెళ్లే టెలిఫోన్, కేబుల్ టీవీ వైర్లను ముట్టుకోవద్దు.
- తడి దుస్తులు, తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకకూడదు, మరమ్మతులు చేయకూడదు.
- చేతికందె ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను కర్రలతో గానీ, ఇనుప చువ్వలతో గానీ తాకే ప్రయత్నం చేయకూడదు.

ఇళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలివీ..

- ఫ్రిజ్, వాషింగ్ మిషన్ వంటి పరికరాల వద్దకు పిల్లలు రాకుండా చూడాలి.
- నీళ్లు ఉన్న పరిసరాల్లో విద్యుత్ పరికరాలు ఉంచకూడదు.
- వర్షం కురిస్తే జల్లులు పడే ప్రాంతంలో విద్యుత్ పరికరాలను ఉంచకూడదు. చేతులు తడిగా ఉన్నప్పుడు స్విచ్‌లను తాకకూడదు.
- ప్లగ్‌లను స్విచ్ బోర్డులోకి పెట్టే సమయంలో గానీ, తీసే సమయంలో గానీ స్విచ్ ఆఫ్ చేసి చేపట్టాలి.
- అనుభవం ఉన్న నిపుణులతో ఇళ్లకు వైరింగ్ చేపట్టాలి.

ప్రమాదాలివీ..



ఆశీర్వాదం మృతదేహం (ఫైల్)

వరదయ్యపాళెం మండలం ముస్లిం పాళెం గ్రామంలో ఊత్తుకోట అసీం ఇంటి వద్దే కరెంటు షాక్‌తో మృతి చెందాడు. అలాగే అదే మండలంలోని బత్తలవల్లంలో ఆలయ ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ దీపాలంకరణ కటౌట్ వద్ద కరెంటు షాక్ తలిగి ఆశీర్వాదం మృతి చెందాడు.

సత్యవేడు మండలం ఎన్ఆర్ అగ్రహారంలో బాలరాజు విద్యుత్ షాక్‌తో మరణించాడు.

కేవీబీపురం మండలం తిమ్మసముద్రంలో సెంట్రింగ్ పనులు చేపడుతుండగా సురేష్ అనే వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మరణించాడు.

నాగలాపురం మండలంలోని బయట కొడింబేడుకు చెందిన చంద్రబాబు చింతకాయలు కోయడం కోసం చెట్టు ఎక్కగా చెట్టు మీదుగా వెళుతున్న విద్యుత్ లైన్లు తగిలి అక్కడికక్కడే మరణించాడు.

నాగలాపురం మండల కేంద్రంలోని కోట వీధికి చెందిన షణ్ముగం పిండి రుబ్బేందుకు గ్రైండర్ స్విచ్ ఆన్ చేయగా కరెంటు షాక్‌తో మరణించాడు.

నియోజకవర్గంలోని 7 మండలాల్లో దాదాపుగా 47 మంది విద్యుత్ షాక్‌తో గాయాల పాలైన వారు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. విద్యుత్ తీగల్లో మార్పు గమనిస్తే వెంటనే సమీపంలోని విద్యుత్ కార్యాలయానికి సమాచారం అందించాలి. గ్రామస్థాయిలో డ్యామేజ్ అయిన పోల్స్ గురించి సమాచారం ఇస్తే తక్షణమే మరమత్తులు చేయిస్తాం. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు జరగకుండా ఉండే అవకాశం ఉంది.

–చంద్రా నాయక్, ఏడీఈ, విద్యుత్‌శాఖ, నాగలాపురం

గ్రేడ్‌-5 కార్యదర్శులకు డీడీఓ అధికారం

సత్యవేడు: గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్‌-5 కార్యదర్శులు ముగ్గురికి జిల్లా అధికారులు ఉద్యోగోన్నతులు కల్పించారు. ఇతర ఖర్చులకు నిధులు ఖర్చు చేసేందుకు వీలుగా డీడీఓ అధికారాలు కల్పించారు. ఈ మేరకు కాదిరివేడు, శిరుణం బూదూరు, అంబాకం, మదనంజేరి, ఆరూరు, కాళమనాయుడుపేట, కొత్తమారికుప్పం, ఏఎంపురం, వీఆర్ కండ్రిగ జడేరి సచివాలయ కార్యదర్శులుగా పనిచేస్తున్నవారు డీడీఓ అధికారం పొందారు. అలాగే వివిధ క్లస్టర్ కేంద్రాల పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రేడ్ 1–4 వరకు ఉన్న కార్యదర్శులను అదే పంచాయతీల్లో డీడీఓ అధికారాలు కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. మండలంలో గ్రేడ్1 మునిరవికుమార్, గ్రేడ్ 3గా మాధవి, లీలా మాధవ్, జలజశ్రీ, లోకేష్, గ్రేడ్ 4గా రజిత, యూ.ప్రకాష్, కుముద ఉన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏఓ

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక రైతు భరోసా కేంద్రంలో సోమవారం రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను వ్యవసాయాధికారి భారతి పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలను పొలాల్లో వేస్తే భూమిలో సత్తువ పెరుగుతుందని తెలిపారు. 10 కేజీల జీలగలు ధర రూ.880 లు కాగా 50 శాతం రాయితీపై రూ.440లకు, అలాగే 10 కేజీల జనుములు రాయితీపై రూ. 440 లకు, పిల్లిపెసర 10 కేజీలు రాయితీపై రూ. 535లకు ఇస్తున్నట్లు తెలిపారు. ఇవి కావలసిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకురావాలని కోరారు. ఎంపీఈఓ రేవతి పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పులుల దినోత్సవం



పులుల ప్రాధాన్యతపై చిత్రలేఖనం వేస్తున్న విద్యార్థులు

తిరుపతి మంగళం : తిరుపతి శ్రీ వేంకటేశ్వర జంతు ప్రదర్శనశాల (ఎస్వీ జూపార్క్)లో సోమవారం సెట్విన్ ఆధ్వర్యంలో ప్రపంచ పులుల, ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూకు వచ్చిన వివిధ పాఠశాలల విద్యార్థులకు జూ క్యూరేటర్ సెల్వం పులుల ప్రాధాన్యతను వివరించారు. పులులతో పాటు అడవులను పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు పులుల ప్రాధాన్యత, పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖనం పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సెట్విన్ సీఈవో మురళీకృష్ణ, నాగభూషణం, జూ అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ చంద్రప్రసాద్, సెట్విన్ మేనేజర్ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలకు నేడు అంకురార్పణ

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి వారి ఆలయ పవిత్రోత్సవాలకు మంగళవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించనున్నారు. బుధవారం నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. వైదిక సంప్రదాయం ప్రకారం ఆలయంలో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో తెలియక జరిగే దోషాల ద్వారా ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రాకుండా ఏటా మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా చేపట్టే పవిత్రోత్సవాల్లో మొదటి రోజు యాగశాలలో పవిత్ర ప్రతిష్ఠ, శయనాధివాసం, రెండోరోజు పవిత్ర సమర్పణ, యాగశాలలో వైదిక కార్యక్రమాలు జరిపించనున్నారు. మూడో రోజు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు ఉదయం స్వామి వారికి స్నపన తిరుమంజనం, సాయంత్రం తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. గృహస్తులు ఇద్దరు రూ.500లు చెల్లించి పవిత్రోత్సవాల్లో పాల్గొనవచ్చు. వారికి ఉత్తరీయం, రవికె, చివరి రోజు ఒక పవిత్రం బహుమానంగా అందజేస్తారు. ఉత్సవాల సందర్భంగా నిత్యం టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

సమస్యలను పరిష్కరించాలి



రేణిగుంటలో రైల్వే అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

రేణిగుంట: స్థానిక రైల్వే గూడ్స్‌షెడ్‌లో పనిచేసే లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సోమవారం రేణిగుంట రైల్వేస్టేషన్ ఇన్‌చార్జి జ్ఞానేంద్ర కుమార్‌కు రైల్వే కాంటాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.మునిరాజా, హమాలి యూనియన్ నాయకులు గోవిందయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి హరినాథ్, వెంకటరమణ కలిసి వినతిపత్రం ఇచ్చారు. అలాగే సీఆర్ఎస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు సమస్యలను కూడా పరిష్కరించాలని రేణిగుంట సీఆర్ఎస్ డిప్యూటీ సీఎంఈ రమేష్‌కు రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు మునెమ్మ, మునిలక్ష్మి, చంద్రకళ వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిరాజా మాట్లాడుతూ గూడ్స్ లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులకు సరైన సదుపాయాలు లేవన్నారు. దీంతో వారికి పని ప్రదేశంలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల విశ్రాంతి తీసుకోవడానికి రెస్ట్ రూములను ఏర్పాటు చేయాలని, గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సదుపాయాలు కూడా కల్పించాలని కోరారు. రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు జీఓ ప్రకారం జీతాలు అమలు చేయాలని, మహిళలపై వేధింపులు, పని ఒత్తిడి తగ్గించి, కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి రైల్వే సంస్థ ద్వారానే పని చేయించాలని ఆల్ ఇండియా రైల్వే కోర్కెలు దినం సందర్భంగా రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేస్తుందని తెలిపారు.

కిక్కిరిసిన రామగిరి

- వేడుకగా రెండోరోజు తెప్పోత్సవాలు
- ఆడికృత్తికకు భారీగా తరలి వచ్చిన భక్తులు



నాగలాపురం: పోటెత్తిన భక్తులు



నాగలాపురం: తెప్పపై విహరిస్తున్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి

నాగలాపురం: ఆడికృత్తిక పర్వదినం సందర్భంగా పిచ్చాటూరు మండలం రామగిరి శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. 35 వేల మందికి పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ కార్యనిర్వాణాధికారి లత తెలిపారు. స్వామివారి మూలవర్లకు భరణి అభిషేకం చేసి, విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. సాయంత్రం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఉత్సవమూర్తులను తిరుచ్చిపై కొలువుదీర్చారు. రాత్రి 7 గంటలకు ఆలయంలో భరణి తెప్పోత్సవాలు వేడుకగా నిర్వహించారు. భరణి అభిషేక ఉభయ కర్తలుగా కాలంజేరి వాస్తవ్యులు మునిరత్నమ్మ, కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

నాగలాపురంలో..

నాగలాపురం: ఆడికృత్తిక సందర్భంగా స్థానిక బజారు వీధిలోని సుబ్రమణ్యస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆడికృత్తిక అభిషేకాలు నిర్వహించి, స్వామి వారిని అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో ఆడికృత్తిక పర్వదినాన్ని సోమవారం మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.

పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో..

నాగలాపురం: ఆడికృత్తిక సందర్భంగా మండలంలోని సురుటుపల్లిలో ఉన్న శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి ఉదయం ప్రత్యేక పూజలతోపాటు పంచామృతాలతో మహాభిషేకం చేశారు. ఊత్తుకోట్టైకు చెందిన శ్రీ కాలికాంబాల్ స్వీట్స్ యాజమానులు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కార్తికేశన్, సతీశ్ శర్మ, గణేశ్ శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కావడి మొక్కులు చెల్లించిన భక్తులు

సత్యవేడు: స్థానిక శ్రీవల్లి దేవసేన సమేత శ్రీశక్తివేల్ మురగన్ ఆలయంలో భక్తులు కావడి మొక్కులు చెల్లించారు. భక్తులకు మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి వార్ల ఉత్సవ ఊరేగింపు సాగింది.

భక్తిశ్రద్ధలతో ఆడికృత్తిక కావళ్లు

నారాయణవనం: తమిళ ఆడినెల కృత్తికను సోమవారం మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకుని కావళ్లు ఎత్తారు. ఆలయాల్లో వళ్లీ, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. టీటీడీ అనుబంధ పరాశురేశ్వర స్వామి, అగస్తీశ్వరస్వామి ఆలయాలతో పాటు బస్టాండ్ సమీపంలోని వినాయకుని ఆలయం, కైలాస నాథకోన శివశక్తి ఆశ్రమంలో ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి స్థానిక బస్టాండ్ సమీపంలో వినాయకుని ఆలయం నుంచి సుబ్రమణ్యస్వామి ఉభయ దేవేరులను ట్రాక్టర్‌పై ఊరేగించారు. మహిళలు మంగళ హారతులు సమర్పించారు.



అభివృద్ధికి చిరునామా

"ఈ చిత్రం రేణిగుంట మండలం కరకంబాడి జెడ్పీ ఉన్నత పాఠశాలలోనిది. 600మందికి పైగా విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలలో గతంలో విద్యార్థులందరూ సమస్యలతో సహవాసం చేశారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన 'నాడు–నేడు' పథకం ద్వారా రూ.60 లక్షలకు పైబిలుకు నిధులతో ఈ పాఠశాలలో మౌలిక వసతుల మెరుగునకు ఖర్చు చేశారు. దీంతో పాఠశాల ఆవరణంలో 'నాడు–నేడు' సిమెంట్ బోర్డును ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఆ మార్గంలో తరగతి గదుల్లోకి వెళుతుండగా... అభివృద్ధికి సాదృశ్యంగా నిలిచిందీ చిత్రం."

-రేణిగుంట

విజ్ఞానగిరికి పోటెత్తిన భక్తజనం

- హరోంహర నామస్మరణలతో మార్మోగిన కొండ





నెమలి, ఇంద్ర విమాన వాహనాలపై ఊరేగుతున్న శ్రీవల్లి దేవసేన కుమారస్వామి



క్యూలో వేచి ఉన్న భక్తులు





ఎండీపుత్తూరులో పూజలు చేస్తున్న భక్తులు, శ్రీకాళహస్తిలో ప్రసాదాలు పంపిణీ చేస్తున్న ఈఓ ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి

శ్రీకాళహస్తి: పట్టణంలోని విజ్ఞానగిరిపై ఉన్న కుమారస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆడికృత్తిక వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆడికృత్తికను పురస్కరించుకుని స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి భక్తులు కావళ్లు మోస్తూ విజ్ఞానగిరికి వచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగు చర్యలు తీసుకున్నారు. స్వామి అమ్మవార్లను దర్శించుకునే భక్తులకు ఆర్టీసీ బస్టాండ్ వైపు అనుమతి ఇవ్వగా, కొండ దిగే భక్తులకు బాబుఅగ్రహారం వైపు నుంచి అనుమతించారు. దీంతో భక్తులు ఇబ్బందులు లేకుండా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాధికారులు భక్తుల తొక్కిసలాటలు నివారించడానికి క్యూలు ఏర్పాటు చేశారు. పట్టణానికి పలువురు ఉచితంగా ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్తికేయ మిత్ర బృందం ఏర్పాటు చేసిన ప్రసాదాల పంపిణీని ఈఓ ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి ప్రారంభించారు. నారదపుష్కరణిలో కల్యాణకట్ట ఏర్పాటు చేశారు. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు పలువురు తలనీలాలు సమర్పించి, స్నానఘట్టాల్లో స్నానాలు ఆచరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈఓ ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి ఏర్పాట్లు పరిశీలించారు.

ఇంద్ర విమానంపై కుమారస్వామి

ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఇంద్ర విమానంపై పురవిహారం చేశారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు

ఆడికృత్తికను పురస్కరించుకుని విజ్ఞానగిరిపై ఉన్న కుమారస్వామి ఆలయానికి విచ్చేసిన భక్తులకు 150 మంది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలందించారు. ఈ కార్యక్రమంలో టి.రమేష్‌బాబు, స్కౌట్ సిబ్బంది నిర్మల, సావిత్రి, సులోచన, ఎస్‌కే అజారుద్దీన్, సుబ్రహ్మణ్యం, ధనుష్, వెంకటేష్, మహేంద్ర, విద్యాసాగర్, మణికంత పాల్గొన్నారు.

నెమలివాహనంపై కుమారస్వామి చిద్విలాసం

శ్రీవల్లి దేవసేన సమేత కుమారస్వామి సోమవారం నెమలి వాహనంపై విహరించారు. ఆలయ అలంకార మండపంలో స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేషాభిషేకాలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమల స్వామి,అమ్మవార్లను నెమలివాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. భక్తులు దర్శించుకుని కర్పూర హారతులు సమర్పించిమొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ఆడికృత్తిక వేడుకలు

ఏర్పేడు: మండలంలోని సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో సోమవారం ఆడికృత్తిక వేడుకలు ఘనంగా జరిగాయి. గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయం ఆవరణలోని ఆనందవల్లి దేవసేన సుబ్రమణ్యస్వామి, ఎండీ పుత్తూరు, పాపానాయుడుపేట తదితర ఆలయాల్లో స్వామివారి విగ్రహాలకు వివిధ అభిషేకాలు, విశేషాలంకరణలు, పూజలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

1న విష్ణు సహస్రనామ జపయజ్ఞం



మాట్లాడుతున్న నాగేంద్రసాయి

తిరుపతి కల్చరల్: ఆలిండియా విష్ణు సహస్రనామ కల్చరల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 1వ తేదీన తిరుమల ఆస్థాన మండపంలో శ్రీవిష్ణు సహస్రనామ అఖండ జప యజ్ఞం చేపడుతున్నట్లు ఫెడరేషన్ వైస్ చైర్మన్ ఎన్. నాగేంద్రసాయి తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. గత 35 ఏళ్లుగా క్రమం తప్పకుండా విష్ణు సహస్రనామ అఖండ జపయజ్ఞం నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈ ఏడాది కూడా 1వ తేదీ ఉదయం 6 నుంచి 2వ తేదీ ఉదయం 10 గంటల వరకు నిరంతరాయంగా 27 గంటల పాటు జప యజ్ఞం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ముగింపు కార్యక్రమానికి అహోబిలం జీయర్ స్వామి హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ఫెడరేషన్ కో–ఆర్డినేటర్ రవిచంద్ర పాల్గొన్నారు.